# మన బడి
## మాస పత్రిక

సంపుటి: 1 సంచిక: 1 డిసెంబర్ – 2024 పేజీలు: 24

పాఠశాల విద్యాశాఖ -
సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో
విద్యావికాస మాసపత్రిక
**మన బడి**

తొలి సంచిక




## బాలికా
వధువును కాను
చదువును




గురుదేవోభవ



విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ స్కూళ్ల తనిఖీలు




అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్



మన బడిలో
విరిసిన పువ్వు
ఈ చిన్నారి
చిరునవ్వు



## ప్రభుత్వం అండగా.. ఆనందాలు నిండుగా.. చిన్నారుల పండుగ.. చిరునవ్వులు మెండుగా..

బాలల దినోత్సవం అనంతరం 'మనబడి' మాసపత్రిక తొలి సంచిక వెలువడటం విద్యార్థులు, ఉపాధ్యాయులకు సంతోషకర సందర్భం. మన దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పిల్లల్లో పెద్దపిల్లాడు. బాలల్లో బాలుడు.. పిల్లలస్వేచ్ఛ, భద్రత, ఆనందం, హక్కులు కోసం కృషిచేసిన చాచా నెహ్రూ పుట్టినరోజుని బాలల దినోత్సవంగా దేశమంతా సంబరంగా నిర్వహిస్తారు. అమూల్యమైన బాల్యాన్ని బడిలో మరింతగా వికసించాలనేది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లక్ష్యం.

చిలుకను పెంచాను.. ఎగిరిపోయింది.. ఉడుతను పెంచాను.. పారిపోయింది.. మొక్కను పెంచాను.. ఆ రెండు వచ్చి చేరాయి అని మాజీ రాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్ కలాం మాటలను ఆదర్శంగా తీసుకున్న పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్షా విద్య అనే మొక్కని బడి అనే భూమిలో నాటారు. ఆ మొక్క చెట్టుగా ఎదిగింది. ఆ చెట్టు నీడనే పిల్లలు విద్యాబుద్ధులు, ఆట-పాటలు, కళలు నేర్చుకుంటున్నారు.

అందమైన బడి, ఆహ్లాదకరమైన పరిసరాలు, పాఠశాలకు వెళ్లేందుకు యూనిఫాం, పుస్తకాలు, బ్యాగు, బెల్టు, షూ. పాఠాలు చెప్పేందుకు, ఆటలు ఆడించేందుకు పిల్లల నిష్పత్తికి సరిపడా నిపుణులైన ఉపాధ్యాయులు, తరగతి గదిలో అత్యాధునిక సౌకర్యాలు, మధ్యాహ్నం ఆకలివేసే సమయానికి ఆరోగ్యకరమైన భోజనం, కాలకృత్యాలు తీర్చుకోవడానికి మరుగుదొడ్లు, ఆడుకోవడానికి స్థలం, క్రీడాపరికరాలు వంటి సౌకర్యాలతో లక్షలాది మంది విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నారు. **సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర, తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం, మన బడి-మన భవిష్యత్తు, బాలికా రక్ష, అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారాలు** వంటి పథకాలతో పాఠశాలలను బలోపేతం చేస్తున్నారు. విద్యార్థులు వికాసానికి పాటుపడుతున్నారు.



# మన బడి
## మాస పత్రిక

సంపుటి: 1 సంచిక: 1 డిసెంబర్ – 2024 పేజీలు: 24

**గౌరవ సలహాదారులు**
**కోన శశిధర్,** ఐ.ఎ.ఎస్.,
సెక్రటరీ, పాఠశాల విద్యాశాఖ
**విజయరామరాజు.వి,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ
**డా. కృతికా శుక్లా,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, ఇంటర్మీడియేట్ విద్య
**ఎడిటర్**
**బి.శ్రీనివాసరావు,** ఐ.ఎ.ఎస్.,
స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్షా
**సలహాసభ్యులు**
**వి.ఎన్.మస్తానయ్య**, డైరెక్టర్, SIEMAT
**ఎం.ఆర్.ప్రసన్నకుమార్,** ASPD –1
**డి.దేవానందరెడ్డి,** సెక్రటరీ, KGBV
**డి.మధుసూదనరావు,** డైరెక్టర్, AP Text Books Press
**కె.నాగేశ్వరరావు,** అడిషనల్ డైరెక్టర్, SAMO
**కె.రవీంద్రనాథ్ రెడ్డి,** ASPD –2
**కె.జీవనజ్యోతి,** సూపరింటెండెంట్, CMO
**వర్కింగ్ ఎడిటర్**
**చల్ల మధుసూదనరావు,** మీడియా కన్సల్టెంట్
**సబ్ ఎడిటర్**
**గణేశ్ బెహరా,** PRO
**ఎడిటోరియల్ కమిటీ**
**డా. ఎస్.వి. లక్ష్మణరావు,**టీఎస్‌జీ (సీఎంవో)
**పైడి.వెంకట రమణ,** సీనియర్ ప్రోగ్రామర్
**డా. కె.శారద,** శామో ఫ్యాకల్టీ
**డా. ఎ.సుహాసిని**, సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. వి.సతీష్ రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. ఎస్.ప్రసాద్ రావు,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**జి. మహేశ్వర రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. టి.ఇస్మాయిల్,** దీక్ష కో ఆర్టినేటర్
**డా. కె. పెంచలయ్య,** టీఎస్‌జీ (ఆర్టీఈ)
**డా. వై.నరసింహం,** టీఎస్‌జీ(ఐఈ)
**పి.వేంకటేశ్వరరావు,** టీఎస్‌జీ (ప్లానింగ్)
**పి.గీత,** టీఎస్‌జీ(ఓఎస్‌సీ)
**డిజైనింగ్**
**గిరిధర్ అరసవల్లి**
**డీటీపీ & సహకారం**
**కె.అభిషేక్**
**చిత్రకారులు**
**మల్లిక్ & లక్ష్మణ్**

## సంపాదకుల మాట

ఇది మనబడి. ఇక్కడ నేర్చుకుందాం. నేర్పుదాం. తెలుసుకుందాం. తెలియజేద్దాం. విద్య ద్వారా విజ్ఞానం, విజ్ఞానం ద్వారా వికాసానికి మార్గం చూపుదాం. మాట, ఆట, పాట ఏదైనా విద్యే. నేను ఒక గురువు అనుకోవద్దు. నేనే ఒక నిత్య విద్యార్థి అనుకుందాం. ఒక మంచి పౌరసమాజాన్ని, ఆరోగ్యవంతమైన అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్మించే భావిభారత పౌరులు మన వద్దే ఉన్నారు. సకల వృత్తులు, ఉపాధులు, కళలు విద్యార్థి నుంచి వికసించేవే. పిల్లల ఆలోచనలు గొప్పవి. విద్యార్థుల ఆవిష్కరణలు అమూల్యమైనవి. రాసే రాతలు, గీసే గీతలు, పాడే పాటలు, ఆడే మాటలన్నీ సరికొత్త పాఠాలే.

శ్రీశ్రీ 'మహాప్రస్థానం' శైశవ గీతిలో చిన్నారుల ఆనంద ప్రపంచాన్ని మన ముందుంచారు.

> ***పాపం, పుణ్యం, ప్రపంచమార్గం–***
> ***కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ***
> ***ఏమీ ఎరుగని పూవుల్లారా,***
> ***అయిదారేడుల పాపల్లారా!***
> ***మెరుపు మెరిస్తే,***
> ***వాన కురిస్తే,***
> ***ఆకసమున హరివిల్లు విరిస్తే***
> ***అవి మీకే అని ఆనందించే***
> ***కూనల్లారా!***

అంటూ తన గీతం వినమంటూనే చిన్నారి స్వేచ్ఛా లోకంని ఆవిష్కరించిన మహాకవి స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యా గీతి వినిపిస్తోంది. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ గారు విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. పాఠశాలల పిల్లల శారీరక, మానసిక, విద్యా వికాసానికి పాటుపడుతోన్న ప్రభుత్వం మనబడి మాసపత్రిక ఆలోచనకు నాందిగా నిలిచింది. బడి అనే స్వేచ్ఛా ప్రపంచంలో పిల్లల సృజనకు ఒక వేదిక **మనబడి** మాసపత్రిక. ఉపాధ్యాయుల పాఠాలు, జీవన నైపుణ్యాలు, నైతిక విలువలు, క్రీడలు నేర్పించే తరగతి గది మనబడి. విద్యావేత్తల సూచనలు, సంస్కరణాభిలాషుల అభిప్రాయాల మాలిక మనబడి పత్రిక. ప్రభుత్వం ఆలోచనలకు అనుగుణంగా విద్యార్థులు–ఉపాధ్యాయుల కోసం పాఠశాల విద్యాశాఖ–సమగ్రశిక్షా ఆధ్వర్యంలో వెలువడుతున్న మనబడి మాసపత్రికని నిండు మనసుతో ఆశీర్వదించండి.. ఆదరించండి..

– **బి శ్రీనివాసరావు,** IAS
రాష్ట్ర పథక సంచాలకులు, సమగ్రశిక్షా

Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed at Digital magazine https://schooledu.ap.gov.in/samagrashiksha/
ఆన్ లైన్ మ్యాగజైన్ కోసం: https://schooledu.ap.gov.in/samagrashiksha/ మరియు cse.ap.gov.in

www.tlm4all.com

# ప్రైవేటుకి ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

**– సీఎం చంద్రబాబు నాయుడు గారు**




ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దాలని, దేశంలోనే మన విద్యా వ్యవస్థ ప్రథమ స్థానంలో ఉండేలా ఏపీ మోడల్ రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు పిలుపునిచ్చారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు విజయవాడ ఏ కన్వెన్షన్ సెంటర్‌లో అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, మంత్రులు కొల్లు రవీంద్ర, సత్యకుమార్, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# స్వర్ణాంధ్ర @2047

**మీ విజన్ - మా మిషన్ : కలిసికట్టుగా ఆంధ్రప్రదేశ్ ను పునర్నిర్మిద్దాం**
**స్వర్ణాంధ్ర @ 2047 కోసం మీ ఆలోచనలను ఆహ్వానిస్తున్నాము**

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 సంవత్సరం నాటికి వందేళ్లు పూర్తవుతున్న శుభతరుణాన్ని అమృత్ కాల్ ఉత్సవాలుగా జరపాలని నిర్ణయించారు. 2047 కల్లా దేశం సమగ్రాభివృద్ధి సాధించడంతోపాటు ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థికశక్తిగా భారతదేశాన్ని నిలపాలనే లక్ష్యంగా వికసిత్ భారత్`2047 కార్యక్రమం రూపుదాల్చింది. మన రాష్ట్రంలో కూడా 'స్వర్ణాంధ్ర@2047' కార్యక్రమానికి గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు శ్రీకారం చుట్టారు.

## విజన్ నిజమయ్యేది ఇలా..

'స్వర్ణాంధ్ర@2047' విజన్ నిజమయ్యేందుకు విద్య, నైపుణ్యం, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం, మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, సుస్థిరత, వాతావరణ స్థితిస్థాపకత, ఆర్థికాభివృద్ధి, అత్యాధునిక తయారీరంగం,లాజిస్టిక్స్, నాలెడ్జి ఎకానమీ, పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ ఇన్నోవేషన్, వ్యవసాయం, ఆహార శుద్ధి, ప్రకృతి వ్యవసాయం, పర్యాటకం, సంప్రదాయ వైద్యం వంటి వ్యూహాత్మక రంగాలపై దృష్టి సారించాలని గుర్తించారు.

## పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు

పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర@2047' అవగాహన పెంపొందించే కార్యక్రమాల్లో అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో సెప్టెంబరు 27 నుండి 29 వరకు 'స్వర్ణాంధ్ర@2047' అంశంపై 6 నుండి 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, చర్చ (డిబేటింగ్) పోటీలు నిర్వహించింది. జిల్లా స్థాయి విజేతలకు బహుమతుల కోసం రూ.1.56 లక్షలు మంజూరు చేశారు.




జిల్లా స్థాయి పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్, డిఈఓ




జిల్లా స్థాయి పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న విశాఖపట్నం జిల్లా కలెక్టర్, డిఈఓ



www.tlm4all.com

# స్వచ్ఛత.. మనందరి బాధ్యత

## 'స్వచ్ఛతా హీ సేవా'లో గౌరవ సీఎం **చంద్రబాబునాయుడు** గారు

పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత మనందరి బాధ్యత కావాలని సీఎం నారా చంద్రబాబునాయుడు గారు పిలుపునిచ్చారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా మచిలీపట్నంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులతో కలిసి సీఎం పాల్గొన్నారు. సీఎం, విద్యార్థులు చెత్త ఊడ్చి రోడ్లను శుభ్రం చేశారు. పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చే ఆరోగ్యవంతమైన భారతదేశం రూపొందాలనే గాంధీజీ కలలు సాకారం చేయాలని సూచించారు.

**పాఠశాల విద్యా శాఖ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల్లో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలు ఘనంగా జరిగాయి**









# మినిస్టర్ లోకేష్ 'క్లాస్ టీచర్'

* విద్యార్థులతో స్నేహితుడిలా సంభాషణలు
* పిల్లల అభ్యసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న మంత్రి
* పాఠశాలల్లో పేరుకుపోయిన సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు
* పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేస్తోన్న విద్యా మంత్రి నారా లోకేష్

విద్యాశాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే తనదైన శైలి పనితీరుతో నారా లోకేష్ గారు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలను ఆకట్టుకుంటున్నారు. దేశంలోనే ఏ రాష్ట్ర విద్యాశాఖా మంత్రి చేపట్టని విధంగా పాఠశాలలను ఆకస్మికంగా సందర్శిస్తున్నారు. పాఠశాలల్లో వాస్తవ పరిస్థితులు, సమస్యలు తెలుసుకుని పరిష్కరించవచ్చనే లక్ష్యంతో ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తున్నారు. ఐదేళ్లలో రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లను అత్యుత్తమంగా తీర్చిదిద్ది దేశంలోనే ఏపీ మోడల్ చేయాలనేది తన లక్ష్యం అని మంత్రి పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలను కల్పించి, సమస్యలన్నీ పరిష్కరించి, విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు అంతా కలిసి పనిచేద్దామని మంత్రి పిలుపునిచ్చారు. జిల్లాల పర్యటనకు వెళ్లినపుడు ఒకరోజు పూర్తిగా స్కూళ్ల పరిశీలనకు కేటాయిస్తున్నారు.

### భీమిలి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం

విశాఖ జిల్లా భీమిలిలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని మంత్రి నారా లోకేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. 10వ తరగతి క్లాస్‌రూమ్‌ను సందర్శించి అక్కడ పాఠ్యాంశాల బోధన, సౌకర్యాలపై విద్యార్థినులను ఆరా తీశారు. ఈ స్కూలు నుంచి ఇద్దరు విద్యార్థినులు ఐఐటిలో సీట్లు సాధించడంపై మంత్రి అభినందించారు.

### అకనంబట్టు జడ్పీ హైస్కూల్

పూతలపట్టు నియోజకవర్గం అకనంబట్టు జడ్పీ హైస్కూల్లో విద్యాశాఖామంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. 8, 9, 10 తరగతుల క్లాస్ రూమ్‌లను సందర్శించి, అక్కడి లోటుపాట్లపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

### శ్రీకాకుళం ఎచ్చెర్ల వీధి, సొరంగో వీధి స్కూళ్లు

శ్రీకాకుళం జిల్లా కేంద్రం ఎచ్చెర్ల వీధి, సొరంగో వీధి పాఠశాలలను విద్యాశాఖామంత్రి నారా లోకేష్ గారు ఆకస్మిక తనిఖీ చేశారు. పిల్లలతో మాట్లాడారు. టీచర్లను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పిల్లల వర్క్ బుక్‌లు పరిశీలించారు.



### విశాఖ నెహ్రూబజార్ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల

విశాఖపట్నం నెహ్రూ బజార్ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల ఆవరణలో అంగన్వాడీ బాలల గదిని మంత్రి సందర్శించారు. పిల్లలతో కొద్దిసేపు సరదాగా గడిపారు.













www.tlm4all.com

## సమగ్రశిక్షా - పాఠశాల విద్యాశాఖ శకటానికి

# ప్రథమ బహుమతి




స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రదర్శించిన శకటాల్లో భాగంగా పాఠశాల విద్యాశాఖ – సమగ్ర శిక్షా శకటానికి ప్రథమ బహుమతి దక్కింది.

విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఈ శకట ప్రదర్శనలో 'చంద్రన్న పాలనలో చక్కని చదువులు' నేపథ్యంగా 'తల్లికి వందనం', 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర', 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం', 'మన బడి–మన భవిష్యత్తు', 'బాలికా రక్షా' వంటి ప్రభుత్వ పథకాలతో పాటు 16,347పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటన, 2047 నాటికి ప్రపంచ అగ్రగామిగా మన విద్యార్థులను తయారు చేయడం వంటి అంశాలను ప్రదర్శించారు.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గౌరవముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి చేతులు మీదుగా పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గారు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి విజయరామరాజు గారు, సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు గారు ప్రథమ బహుమతి అందుకున్నారు.











గౌరవ సీఎం నారా చంద్రబాబునాయుడు గారి చేతులు మీదుగా అవార్డు అందుకున్న విద్యాశాఖా ఉన్నతాధికారులు

# బడిపిల్లల ప్రయోగం.. రైతులకు ప్రయోజనం



* తడిచిన ధాన్యం ఆరబెట్టే పాడీ డ్రైయర్ తయారీ
* 'అటల్ టింకరింగ్ ల్యాబ్ స్టేట్ హబ్'లో డ్రైయర్ ప్రదర్శన
* పెనమలూరు జెడ్పీ హైస్కూలు విద్యార్థుల వినూత్న ఆలోచన

ఎన్నో కష్టాలు, మరెన్నో నష్టాలకు ఓర్చి పండించిన పంట తడిస్తే.. ఆ రైతు కంట కన్నీరే. ఇంట విషాదమే. అన్నదాతలకు తడిచిన ధాన్యం కష్టాలు, కన్నీళ్లు లేకుండా చేయాలనే విద్యార్థుల ఆలోచనలకు కార్యరూపమే ప్యాడీ డ్రైయర్. కృష్ణా జిల్లా



పెనమలూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో అన్నదాతలకు అండగా నిలిచేందుకు రూపొందించిన ఈ పాడీ డ్రైయర్ 'అటల్ టింకరింగ్ ల్యాబ్ స్టేట్ హబ్'లో ఉంది. సెన్సార్ల ద్వారా ఆటోమేటిగ్గా పని చేసే పాడీ డ్రైయర్ మనుషుల ద్వారా కూడా నియంత్రించవచ్చు. వాతావరణ పరిస్థితులలో మార్పులను గుర్తించే సెన్సార్లు అవసరాన్ని బట్టి ధాన్యంపై కవరింగ్ తెరవడం లేదా మూసివేయడాన్ని చేస్తాయి. పంటలు లేదా ఆహార పదార్థాలకు అవసరమైన వాతావరణం సృష్టించేందుకు వేడిని ఉత్పత్తి చేస్తాయి, నియంత్రిస్తాయి.

### పాడీ డ్రైయర్ పనిచేస్తుంది ఇలా..

**1. వాతావరణ సెన్సార్లు:** అధునాతన సెన్సార్లు వాతావరణ మార్పులను, ముఖ్యంగా భారీ వర్షపాతాన్ని గుర్తిస్తాయి.

**2. కవరింగ్ మెకానిజం:** భారీ వర్షాలు గుర్తించి మొత్తం వరి పొలంపై రక్షణ కవచంలా విస్తరించి ఉంటుంది.

**3. వేడి-ఉత్పత్తి డ్రైయర్‌లు:** తడిసిన ధాన్యం తేమ ఆరడానికి ఈ డ్రైయర్లు పని చేస్తాయి.

**4. డ్రైయర్ శక్తి మూలం:** సోలార్ వంటి పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా పనిచేస్తుంది.

### ప్రయోజనాలు:

వరి, మిరప, మొక్క జొన్న తదితర పంటల రక్షణకు ఈ పాడీ డ్రైయర్ ఉపయోగపడుతుంది. పర్యావరణ హితమైన సోలార్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులతో పనిచేస్తుంది. పంటలను ఎండబెట్టడం, నిల్వ చేయడం కూడా ఈ యంత్రం చేస్తుంది. తృణధాన్యాలు, చేపలు, అప్పడాలు వంటివి కూడా డ్రైయర్ ద్వారా ఆరబెట్టుకోవచ్చు.

### పాడీ డ్రైయర్ తయారు చేసిన పెనమలూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

• చింతా లోకసాయి నందిని • నడిపినేని తేజశ్రీ
• రాచపల్లి పావని • మహమ్మద్ రజాక్
• గుంటి తరుణ్ సాయి రామ్ • నందం మనోజ్ సాయి.

మెంటార్లు: డివి సుబ్బారావు, పెనుమర్తి వెంకటేష్.

సారథ్యం: వై దుర్గాభవానీ, ప్రధానోపాధ్యాయిని.





# అటల్ మారథాన్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కి రెండో ర్యాంకు

నీతి ఆయోగ్ అటల్ ఇన్నోవేషన్ ప్రతి ఏటా అటల్ మారథాన్ నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా 2023-24 సంవత్సరానికి గానూ ఆన్ లైన్ ప్రాజెక్టు పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండో ర్యాంకు దక్కింది. ర్యాంకు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు శ్రీ బి.శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా 2000 ప్రాజెక్టులు సమర్పించగా వాటిల్లో 500 ఉత్తమ ప్రాజెక్టులు ర్యాంకులు వారీగా ఎంపికయ్యాయని, అందులో మన రాష్ట్రానికి చెందిన ప్రాజెక్టులు 35 ఎంపిక జాబితాలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని అటల్ టింకరింగ్ లాబ్ లను ఉపయోగంలోకి తీసుకువచ్చి, టీచర్స్, విద్యార్థులకు కార్యశాలలను యునిసెఫ్, విజ్ఞాన్ ఆశ్రమం సంస్థల సహాయంతో నిర్వహిస్తున్నామని తెలియచేశారు.

## తక్కువ ఖర్చుతో సెలైన్ అలారం ప్రాజెక్టుకు రెండో ర్యాంకు

శ్రీకాకుళం జిల్లా ఇప్పిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సమర్పించిన తక్కువ ఖర్చుతో సెలైన్ అలారం (Empty Saline Reminder)ప్రాజెక్టుకు రెండో ర్యాంకు దక్కింది. ఈ ప్రాజెక్టు ఆ పాఠశాల బయాలజీ స్కూల్ అసిస్టెంట్ ఎస్.ఉమామహేశ్వరి మార్గదర్శకత్వంలో పదో తరగతి చదువుతున్న డి. నవీన్ కుమార్ బృంద నాయకునిగా, జె.ఎస్.హాసిని, హరి సింహాద్రి రూపొందించారు.

### ఈ ప్రాజెక్టు ఖర్చు తక్కువ.. లాభం ఎక్కువ

Empty Saline Reminder వినియోగం ఇదీ.. ఆసుపత్రిలో పేషెంట్లకు సెలైన్ ఎక్కిస్తున్నప్పుడు రోగి సహాయకులు గానీ, నర్స్ గానీ ఏదైనా కారణం చేత గమనించకపోతే.. రోగి శరీరం నుండి రక్తం సెలైన్ పైపులోకి వస్తుంది. ఇలా జరిగితే పేషెంట్స్ ఎక్కువ రక్తం కోల్పోతారు. ఈ సమస్య నివారించడానికి సెలైన్ 5 మి.లీ.ఇంకా మిగిలి ఉండగా అలారం (సెలైన్ రిమైండర్ )మోగుతుంది. దీనివల్ల పేషెంట్ రక్తం నష్టం వాటిల్లకుండా కాపాడవచ్చు. ఈ ఆలోచన అన్ని ఆసుపత్రుల్లోనూ, ఇళ్ళలోనూ ఉపయోగించవచ్చు. ఖర్చు తక్కువ, లాభం ఎక్కువ. ఈ ప్రాజెక్టు రూపకల్పనకు అయిన ఖర్చు రూ. 280.

### కావలసిన పరికరాలు:

స్ప్రింగ్ త్రాసు, అలారం, ఎల్ఈడీ బల్బ్, వైర్లు, స్విచ్, బాటరీ టేప్, కాపర్ వైర్.



**అటల్ మారథాన్ పోటీలో ఏపీ సాధించిన ర్యాంకులివే:**

**2, 42, 59, 66, 114, 115, 117, 122, 129, 137, 165. 169, 196, 244, 247, 251, 261, 266, 272, 273, 287, 306, 368, 376, 392, 393, 424, 427, 436, 441, 443, 453, 457, 466, 478.**





www.tlm4all.com

# ఆహా ఏమి రుచి .. తినరా మైమరిచి..

## ప్రాంతాలవారీగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం మెనూ మార్పు

విద్యార్థులకు నచ్చిన, పోషకాహార నిపుణులు మెచ్చిన, వైద్యులు సూచించిన ఆహారం ఇక నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంలో వండి వడ్డించనున్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, వంటవారు అభిప్రాయాలు తీసుకొని ప్రాంతాలవారీగా మెనూని తీసుకురావాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా మధ్యాహ్న భోజన పథకం పై మంగళగిరిలో రాష్ట్రస్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. అన్ని జిల్లాల నుంచి హాజరైన మిడ్ డే మీల్స్ నిర్వాహకులు, కుక్‌లు ఆ ప్రాంతపు ఆహారాన్ని వండి స్టాళ్లలో ప్రదర్శించారు. ఉన్నతాధికారులు, పోషకాహార నిపుణులు ఆహార పదార్థాలను రుచి చూశారు.






# విజయవంతంగా శిక్షా సప్తాహ్ సంబరాలు

జాతీయ విద్యా విధానం – 2020 ప్రారంభించి నాలుగు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జూలై 22 నుండి 29 వరకు రాష్ట్రంలో అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్' కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు, శిక్షా సప్తాహ్ నోడల్ ఆఫీసర్ బి.శ్రీనివాసరావు IAS తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛంద సేవా కార్యక్రమమైన 'విద్యాంజలి' లో ఒక్కరోజే 2500కి పైగా పాఠశాలలు , 1500 మంది పైగా వాలంటీర్లు స్వచ్ఛంద సేవలు అందించడానికి విద్యాంజలి పోర్టల్ లో నమోదు చేసుకున్నారని తెలిపారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించిన ఆర్జేడీలు, జిల్లా అధికారులు, డైట్ ఉపాధ్యాయులను సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు ప్రశంసించారు.




శిక్షా సప్తాహ్ పాల్గొన్న విద్యార్థులు

## వారధి ఫౌండేషన్ పోటీలో కింతలి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

వారధి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ కందా ప్రతి సంవత్సరం నిర్వహించే రాష్ట్రస్థాయి ఆంగ్ల వక్తృత్వ పోటీల్లో అనకాపల్లి జిల్లా మాడుగుల మండలంలో కింతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మైచర్ల రమ్యశ్రీ, దండి ప్రత్యూష, కొటారి లిఖిత రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. ఈ విద్యార్థులకు ఆంగ్ల భాష ఉపాధ్యాయిని వి.చంద్రకళ మార్గదర్శకత్వం వహించారు. విజేతలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. మొదటి బహుమతిగా ఒక్కొక్కరికి రూ. 12 వేలు రెండో బహుమతిగా రూ. 15 వేలు, మూడో బహుమతిగా రూ. 9 వేలు, కన్సోలేషన్ రూ. 5వేలు చొప్పున విద్యార్థుల అకౌంట్ కు నేరుగా జమ చేశారు. పాల్గొన్న ప్రతి విద్యార్థికి రూ. 500 ప్రోత్సాహక బహుమతిగా ఇచ్చారు. వారధి ఫౌండేషన్ వ్యాసరచన మరియు డిబేట్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యార్థులు లక్ష రూపాయల నగదును బహుమతుల రూపంలో గెలుచుకున్నారు.




కింతలి విద్యార్థులు



www.tlm4all.com



# డిటెక్టివ్ హిమజ

(కథ)



**హి**మజ ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతోంది. చాలా తెలివైన, చురుకైన పిల్ల. హిమజ వాళ్ల నాన్నకు ప్రమోషన్ రావడంతో వారి కుటుంబం దగ్గరలోని సిటీలో ఉండాల్సి వచ్చింది. అందుకోసం హిమజ వాళ్ల కుటుంబం ఒక ఇల్లు అద్దెకు తీసుకున్నారు. కాస్త జీతం బాగానే ఉండడంతో విశాలమైన ఇల్లు తీసుకున్నారు.

ఆరోజు రాత్రి అందరూ కలసి భోజనం చేస్తున్నపుడు ఏదో శబ్దం వచ్చినట్లు అనిపించింది. ఏమై ఉంటొచ్చో అని కంగారు పడుతూ హిమజ వాళ్ల నాన్న ఇంటి చుట్టూ పరిశీలించారు. ఏమీ కనిపించలేదు. సరే అనుకుని అందరూ హాల్లోనే పడుకున్నారు. ఇలా రెండు మూడు రోజులు గడిచాయి. హిమజ కూడా ఆలోచిస్తూనే ఉంది.

తరువాతి రోజు రెండో శనివారం సెలవు కావడంతో హిమజ ఎలాగైనా ఆ శబ్దానికి గల కారణాన్ని కనుగొనాలని గట్టిగా అనుకుంది. హాల్లో నేలపై పడుకుని కళ్ళు మూసుకుని జాగ్రత్తగా శబ్దం ఎటు నుండి వస్తుందో అని గమనించసాగింది.

పక్కనే ఉన్న బెడ్ రూమ్ నుండి శబ్దం వస్తుంది అని నిర్ధారించుకుని, అక్కడకు వెళ్లింది. అక్కడ కూడా నేలపై పడుకుని ఏకాగ్రతతో వినసాగింది. అవును, ఈ గోడ నుండే ఆ శబ్దం వస్తుంది అని పసిగట్టింది. జాగ్రత్తగా గమనించి చూస్తే గోడ రంగులోనే ఒక తలుపు కనిపించింది. ఆశ్చర్యం! అంతేకాదు అక్కడ ఇంకో బాత్ రూమ్ ఉంది. మెల్లగా లోపలికి వెళ్లి చూడగా అక్కడ ఉన్న కుళాయిలో చుక్క చుక్కలుగా నీరు పడటం వలననే ఆ శబ్దం వస్తోందని కనిపెట్టింది.

యురేకా! అంటూ హిమజ అమ్మ దగ్గరకు వెళ్లి జరిగిందంతా చెప్పింది.

రెండో బాత్ రూమ్, అదీ ఇంటిలోపలే ఉందని అమ్మ సంబరపడింది. మరి భయం లేదంటూ చెల్లి సంతోషించింది. హిమజ పట్టుదలను, నిశిత పరిశీలనను నాన్న మెచ్చుకున్నారు.

నీరు వృధా కాకుండా ఉండేలా నాన్న కుళాయిని బాగు చేయించారు. అప్పటినుండి ఆ శబ్దం మాయమైంది. అందరూ ఆనందంతో 'డిటెక్టివ్ హిమజ' ను అభినందించారు.



## చిన్నారి డిటెక్టివ్‌లు మీరూ రాయండి..

హిమజ లాగే ఆలోచించే డిటెక్టివ్ పిల్లలూ మీరు తెలుసుకున్న అంశాలు, కనిపెట్టిన విషయాలు, మీ డిటెక్టివ్ ఆలోచనలను రాసి మాకు పంపండి. మీ పేరు, స్కూలు, ఫోటో వివరాలు ఇవ్వడం మర్చిపోవద్దు. విజ్ఞానాత్మకంగా, ఆలోచనాత్మకంగా ఉన్న మీ కథకు చిరు బహుమతి ఉంటుంది పిల్లలు.. ఇంకెందుకు ఆలస్యం.. మెదడుకి మేత పెట్టే ఆలోచనలను రాసి '**మనబడి**'కి పంపండి.

అడ్రస్: **సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయం,** కేబీసీ బాయ్స్ హైస్కూల్ కాంపౌండ్, పటమట, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్: 520 010, వాట్సాప్ నంబర్: 8712652298
manabadimagazine@gmail.com



www.tlm4all.com






కవర్ స్టోరి

**కేజీబీవీ విద్యార్థిని సజ్జగూడ నిర్మల విజయగాథ**

**టెన్త్ టాపర్ కూలీ పనులకెళ్లడంతో కళాశాల చదువుకి దూరం**

**నాటి కలెక్టర్ అండ, సమగ్రశిక్షా సహకారంతో ఇంటర్‌లో చేరిక**

**బడికి దూరమైన బాలికలకు నిర్మల విద్యావిజయం స్ఫూర్తి**

ఆంధ్రప్రదేశ్– కర్ణాటక సరిహద్దులో ఉన్న గ్రామం పెద్ద హరివాణం. అక్కడ పత్తి చేలో పనిచేస్తున్న నిర్మల అనే బాలిక కలలు పత్తి కాయల్లా ఎండకి పేలి రాలిపోతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి 537 మార్కులు తెచ్చుకున్న టాపర్ నిర్మల కలం వదిలి పొలంలో కూలి పనులు చేస్తోంది. తల్లిదండ్రుల పేదరికం, పల్లెల్లో మూఢనమ్మకాలతో చదువు ఆపేసి కూలీ పనులకెళ్లక తప్పలేదు. ఆ ఊరిలో ఆడపిల్లకి 15 ఏళ్లు దాటితే పెళ్లి చేసేయాల్సిందే. పదోతరగతి దాటి చదివే ఆడపిల్లలు అక్కడ అరుదు. తనకంటే పెద్దవారైన ముగ్గురు అక్కలకు ఇలాగే పెళ్లిళ్లు అయ్యాయి. పదితోనే చదువు ఆగింది. టెన్త్ స్కూల్ టాపర్ నిర్మలకు ఇష్టమైన విద్య ఆగిపోయింది కానీ, ఇష్టంలేని వివాహం పొంచి ఉంది. ఎట్టి పరిస్థితుల్లో తాను బాలికా వధువును కాను, చదువును



# బాలికా వధువును కాను చదువును




www.tlm4all.com



కొనసాగించి తన కల సాకారం చేసుకుంటాననే దృఢనిశ్చయంతో ఉండేది

తమ ఇంటికి వచ్చిన ప్రభుత్వ అధికారులతో నిర్మల తాను ఎలాగైనా చదువుకుంటానని, తల్లిదండ్రులను ఒప్పించాలని వేడుకుంది. ఇదే అంశం ఓ పత్రికలో కథనంగా వచ్చింది. అప్పటి కర్నూలు కలెక్టర్ సృజన స్పందించారు. స్కూల్ నుంచి కూలీ పనులకెళ్లి ఆగిన చదువు కొనసాగించే ఏర్పాటు చేశారు. ఆస్పరిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ) ఇంటర్ బైపీసీలో చేర్పించారు. ఇంటర్ మొదటి సంవత్సరం 440కు గాను 421 మార్కులు తెచ్చుకుని ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన సజ్జగూడ నిర్మల విద్యా విజయంపై '**మనబడి**' ప్రత్యేక కథనం..





Ministry of Education
@EduMinOfIndia

Congratulations to Ms. G. Nirmala from Kasturba Gandhi Balika Vidyalaya (KGBV), Kurnool, a residential girls' school run by the Ministry of Education for the disadvantaged sections in India, for securing the top spot in the 1st Year Intermediate exam of Andhra Pradesh Intermediate Board.

Despite overcoming challenges like being rescued from a child marriage, she scored an impressive 421 out of 440. Her aspiration to become an IPS officer showcases her dedication to social justice. Let's celebrate her courage and wish her the best for her future pursuits!

నిర్మలను ప్రశంసిస్తూ ట్వీట్ చేసిన కేంద్ర విద్యామంత్రిత్వశాఖ.

"నాన్న సజ్జగూడ శీలప్ప, హనుమంతమ్మలు పొలం పనులకి వెళ్తారు.. నలుగురు ఆడపిల్లల్లో నేనే చిన్నదాన్ని. హైస్కూలు చదువు కూడా దాటని మా ముగ్గురు అక్కలకూ పెళ్లిళ్లు అయ్యాయి. మా ఊర్లో చాలామంది ఆడపిల్లలను స్కూలు మాన్పించి పెళ్లి చేయడం చూసి భయపడేదానిని. పదోతరగతిలో మా స్కూలులోనే అత్యధికంగా 537 మార్కులు నాకు వచ్చాయి. అందరూ అభినందించారు. కానీ అమ్మనాన్న ఇంటర్‌లో చేర్చలేదు. పొలం పనులకు తీసుకెళ్లేవారు. కలుపు తీయడం, పత్తి ఏరడం, సజ్జ కంకులు కోసేదాన్ని. కూలిపనులకు కూడా వెళ్లాను. పొలంలో ఏ పనిచేస్తున్నా నా దృష్టి అంతా చదువుపైనే ఉండేది.

ఇంటింటికీ ప్రభుత్వ అధికారులు వచ్చినప్పుడు నాకు ఇంటర్ లో చేరి చదువుకోవాలని ఉందని చెప్పాను. మా అమ్మానాన్నలను ఒప్పించేందుకు అధికారులు ప్రయత్నించినా వారు ససేమిరా అన్నారు. ఇదే విషయం ఓ పత్రికలో 'ప్లీజ్.! మా అమ్మకు మీరైనా చెప్పండి' శీర్షికతో కథనం ప్రచురితం అయ్యింది. ఇది చూసిన కలెక్టరు సృజనా మేడం మా అమ్మానాన్నలను ఒప్పించి, నన్ను ఆస్పరిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) లో ఇంటర్ బైపీసీలో చేర్పించారు. ఏడాది చదువుకి దూరమైనా ఉపాధ్యాయుల సహకారంతో ఫస్టియర్ 440కు గాను 421 మార్కులు తెచ్చుకున్నాను. నా పర్యవేక్షణ బాధ్యతను సర్వశిక్షా అభియాన్ అధికారి వేణుగోపాల్ సార్‌కు అప్పగించారు. మా అధ్యాపకులు, వార్డెన్ కూడా నన్ను బాగా ప్రోత్సహించారు. నేను ఇంటర్ మంచి మార్కులతో పూర్తి చేస్తాను. సివిల్ సర్వీసెస్ నా జీవిత లక్ష్యం. మా అమ్మానాన్నలు కూడా ఇప్పుడు ఎంతవరకైనా చదువుకో అమ్మా అంటున్నారు." అని నిర్మల తన మనోగతాన్ని '**మనబడి**' కి వెల్లడించింది.

**– చల్ల మధుసూదనరావు,**
మీడియా కన్సల్టెంట్, సమగ్ర శిక్షా






www.tlm4all.com



# బొమ్మ గీశానోచ్!

## ప్రథమ బహుమతి పొందిన చిత్రం





ఎస్.అవినాష్, 10వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
కోటనందూరు, కాకినాడ జిల్లా

## ద్వితీయ బహుమతి పొందిన చిత్రం





షేక్ తన్వీర్, 8వ తరగతి,
జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల,
గూడూరు, తిరుపతి జిల్లా.

## తృతీయ బహుమతి పొందిన చిత్రం





టి.నవతేజశ్విని, 10వ తరగతి,
కేజీబీవీ, గంట్యాడ, విజయనగరం.

## కథ

# అత్యాశపరుడు

**బహుమతి పొందిన కథ**

★★★

సి.బెళగల్ గ్రామంలో రామయ్య ఉండేవాడు. అతనికి కూరగాయల మొక్కలు పెంచడం అంటే చాలా ఇష్టం.

ఒకరోజు అడవిలోకి కట్టెలకు వెళ్తున్నాడు. రామయ్య వెళ్ళుతూ ఉండగా ఒక ఋషి కనిపించాడు. ఆ ఋషి "రామయ్యా ఇలా రా.." అని పిలిచాడు.

అప్పుడు రామయ్య ఋషి దగ్గరకు వెళ్లి నమస్కరించాడు. ఆ ఋషి రామయ్యకి బంగారు టమోటా విత్తనాలు ఇచ్చాడు. ఆ ఋషి రామయ్యతో ఇలా అన్నాడు. "ఈ విత్తనాలు నీ తోటలో నాటు. వాటి నుంచి వచ్చిన బంగారు టమోటాలతో ఎవరైనా ఆపదలో ఉన్నవారికి ఆ టమోటాలు అమ్మి సహాయం చేయి" అని చెప్పాడు.

"సరే" ఋషి గారు అని ఆ విత్తనాలు తీసుకొని ఇంటికి వెళ్ళాడు రామయ్య.

రామయ్య ఇంటికి వెళ్ళాక ఋషి ఇచ్చిన విత్తనాలను తన కూరగాయల పొలంలో నాటాడు. కొన్ని రోజుల తర్వాత చెట్టు మొలిసింది. అలాగే బంగారు టమోటాలు కూడా కాసింది.

ఆ బంగారు టమోటాలను తీసుకొని బజార్లో రెండు లక్షలకు అమ్మాడు. వచ్చిన డబ్బులతో పేదవాళ్ళకి సహాయం చేయకుండా తాను పెద్ద భవనం కొనుక్కున్నాడు.

అత్యాశ మరింత ఎక్కువైంది. తాను ధనవంతుడు కావాలని ఆలోచనతో ఇలా అనుకుంటాడు. ఇప్పుడు కాసిన టమోటాలను తీసుకొని మల్లా నాటితే, మరో చెట్టు వస్తుందని అత్యాశపడ్డాడు రామయ్య.

టమోటా విత్తనాలు మొలకెత్తాయి. చెట్లు పెరిగాయి. కానీ టమోటాకు బదులుగా వింతైన టమోటా కాసింది. అప్పుడు రామయ్య 'ఏంటి బంగారు టమోటాలు కాస్తాయి అనుకుంటే వింత వింత టమోటా కాసింది.' అనుకుంటాడు రామయ్య.

కానీ రామయ్య దాన్ని తీసుకొని ఇంట్లోకి వెళ్ళాడు. అప్పుడు వింతైన టమోటాలలో నుండి రామయ్యకు బంగారు టమోటా విత్తనాలు ఇచ్చిన ఋషి ఆత్మ అందులో నుంచి బయటికి వచ్చింది. ఆ ఋషి ఆత్మ రామయ్యతో ఇలా అంటాడు. "ఒరేయ్ దుర్మార్గుడా..! నేను ఇచ్చిన బంగారు టమోటా విత్తనాలు నాటి వాటిల్లో నుండి వచ్చిన బంగారు టమోటాలతో ప్రజలకు సహాయం చేయమని చెబితే నువ్వు ప్రజలకు సహాయం చేయకుండా నీ అత్యాశ కోసం వాడుకుంటావా..? కాబట్టి నేను ఇచ్చిన బంగారం టమోటా చెట్టును, అలాగే నీ ఇంటిని, నువ్వు బంగారంతో కొనుక్కున్న వస్తువులన్నీ తీసుకొని వెళ్తాను" అని చెప్పి ఋషి అన్నీ తీసుకొని అక్కడి నుండి వెళ్లిపోయాడు.

అప్పుడు రామయ్య రోడ్డున పడతాడు. రామయ్య మనసులో ఇలా అనుకుంటాడు .మనం ఎవరినైనా మోసం చేస్తే ఆ మోసం మనకే జరుగుతుందని తన తప్పుని తెలుసుకుంటాడు రామయ్య.

– ఎం హర్షవర్ధిని, పదవ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలకల్ (గ్రామం),
సి.బెళగల్ (మండలం), కర్నూలు (జిల్లా),

## నెమలి నెమలి

★★★


**బహుమతి పొందిన కవిత**



నెమలి నెమలి
అందాల నెమలి.
రంగుల ఈకల
వయ్యారి నెమలి.
నెమలికి నేను గింజలు వేస్తే,
నెమలి నాకు ఈకను ఇచ్చే!
ఈకను తీసుకెళ్లి కృష్ణుడు కిస్తే,
కన్నయ్య నాకు అ ఆ లు నేర్పే!
అ ఆ లు తీసుకెళ్లి పంతులకిస్తే,
పంతులు నాకు బహుమతి ఇచ్చే!
అమ్మ నాన్న ముద్దులు,
పిల్లలు కొట్టారు చప్పట్లు.



– ఆర్.అనుశ్రీ, 8వ తరగతి.
అంబేద్కర్ బాలికల గురుకులం,
పుదూరు, తిరుపతి జిల్లా.



## కాలములు

వచ్చిందండీ వచ్చింది
వేసవి కాలం వచ్చింది
ఎండా వేడిని తెచ్చింది
మండే నేలను ఇచ్చింది

కావాలండీ కావాలీ
చల్లని నీరు కావాలి
ఖద్దరు బట్టలు కావాలి
కాళ్ళకు చెప్పులు కావాలి

వచ్చిందండీ వచ్చింది
వానా కాలం వచ్చింది
మెండుగ వానలు తెచ్చింది
జగతికి నీటిని ఇచ్చింది


కావాలండీ కావాలి
ఆరిన దుస్తులు కావాలి
తలకూ గొడుగూ కావాలి
వేడిగ వంటలు కావాలి

వచ్చిందండీ వచ్చింది
శీతాకాలం వచ్చింది
చలి చలిగా వణికించింది
పొగమంచుతో నింపింది

కావాలండీ కావాలి
చలికీ మంటలు కావాలి
ఉన్నీదుస్తులు కావాలి
వెచ్చని నీరూ కావాలి!

★★★

– డి.కె.చదువులబాబు
తెలుగు భాషోపాధ్యాయుడు
ప్రొద్దుటూరు.వై.యస్.ఆర్.కడపజిల్లా.



## రంగులు వేయండి



## దాగుడుమూత దండాకోర్

ఫ్రెండ్స్.. ఇంగ్లీషు అక్షరాల మధ్యలో కొన్ని పదాలుగా దాగున్నాం. మీరు వెతికి పట్టుకోగలరా?

### Brain Teaser Word Search

| | | | | | | | | | | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| A | L | E | R | I | G | H | T | F | O | E | K | B | K | Y | R | O | M | E | M | M | C | S | T |
| F | T | L | M | H | O | H | S | Z | W | I | E | X | P | L | O | R | A | T | I | O | N | E | B |
| T | V | U | J | L | V | H | K | U | M | M | I | K | F | L | K | K | V | S | O | I | H | R | Y |
| Z | G | Y | Q | S | N | T | O | W | P | I | S | T | R | E | S | S | P | F | I | F | W | R | R |
| N | H | A | K | H | J | O | W | H | L | E | J | W | W | F | U | N | C | T | I | O | N | Z | K |
| W | V | I | S | I | O | N | I | I | U | X | R | L | S | M | A | F | E | K | Z | S | A | A | B |
| E | F | N | O | R | K | L | M | T | W | R | Z | F | D | O | P | A | M | I | N | E | Y | S | O |
| Q | B | K | T | Y | C | Z | Y | Z | I | B | P | X | O | V | Y | R | M | H | L | S | T | S | F |
| X | P | O | O | E | N | O | K | G | K | N | D | J | Q | O | P | Z | A | C | F | F | F | N | P |
| S | C | S | L | N | B | V | R | H | M | Z | G | B | B | A | D | V | S | G | E | G | O | V | D |
| G | S | U | N | V | K | Z | S | T | B | F | Y | O | M | T | J | S | D | L | S | V | I | N | F |
| B | A | L | R | W | U | M | N | W | E | K | O | Q | C | T | Y | T | F | E | E | Q | E | S | K |
| Y | I | C | J | P | T | E | O | X | M | X | I | C | H | E | U | I | H | F | R | J | N | X | J |
| L | T | Z | E | K | K | Q | R | Z | T | D | T | A | B | N | T | M | E | S | M | I | B | H | E |
| N | N | Q | I | T | E | B | U | P | K | I | W | A | E | T | K | U | M | V | N | Q | W | B | R |
| D | E | A | L | P | P | B | E | Z | X | W | U | X | U | I | C | L | I | E | W | E | F | H | M |
| S | M | H | I | H | Q | T | N | R | N | Y | E | Z | Z | O | D | A | S | C | O | F | K | V | U |
| E | E | E | M | U | S | I | C | Z | Z | R | K | V | C | N | V | T | P | Z | W | U | X | B | Z |
| N | D | G | S | Z | B | O | C | E | C | S | Y | S | I | A | Z | E | H | H | N | O | R | Z | O |
| S | Z | M | P | L | E | A | L | I | O | U | Q | U | Y | N | C | H | E | T | Q | A | T | M | D |
| E | Y | Z | N | I | O | X | S | L | M | S | L | E | E | P | V | N | R | N | I | O | A | G | I |
| S | L | H | C | U | T | E | M | P | O | R | A | L | E | N | W | J | E | N | H | C | H | G | C |
| L | X | M | H | K | E | C | P | G | B | T | K | W | K | S | O | R | Y | V | H | Z | U | D | Y |
| C | Y | T | Q | P | H | F | J | F | S | Z | K | C | U | I | U | E | O | X | F | R | Y | D | R |

| | | | | |
|---|---|---|---|---|
| attention | brain | cognition | cortex | dementia |
| Dopamine | exercise | exploration | function | hemisphere |
| left | lobe | memory | music | neurons |
| right | senses | sleep | stimulate | stress |
| superfood | temporal | vision | wired | |


## రాత మీది.. బహుమతి మాది

హాయ్ నేస్తాలూ! మీ సొంత భావనలతో బొమ్మలు గీయండి, కథలు, కవితలు,జోకులు, స్వదస్తూరితో సూక్తులు రాసి పంపండి. బహుమతులు గెలుచుకోండి. ఈ పోటీలు పిల్లలను ప్రోత్సహించడానికి మాత్రమే.

manabadimagazine@gmail.com

## పజిల్

### అన్నా .. దారేది



మా అన్నయ్య, అక్కతో జాతరకు వెళ్తూ.. దారి తప్పిపోయాను. కాస్త దారి చూపిస్తారా.. ప్లీజ్.

## మీకు తెలుసా

* మొట్టమొదటి ఇంగ్లీషు డిక్షనరి ని 1755లో రాసారు.
* పిల్లులు వాటి జీవితంలో 66 శాతం నిద్రలోనే గడుపుతాయి.
* పావురం ఎముకలు దాని ఈకలకంటే బరువు తక్కువగా ఉంటాయి.
* పాములకు ఒకే ఒక శ్వాసకోశం ఉంటుంది.
* మన కంటిలోని కండరాల కదలికలు రోజుకు లక్ష సార్లు కదులుతూ వుంటాయి.
* పక్షి జాతుల్లో వాసన గుర్తించ గల శక్తి ఒక్క 'కివి' పక్షులకు మాత్రమే వుంటుంది.
* ఈ భూమ్మీద 50% ఆక్సిజన్ అమేజాన్ అడవి నుంచే వస్తుంది.
* రెండుసార్లు నోబెల్ బహుమతి అందుకున్న 'మేడం క్యూరీ'తో పాటు ఆమె భర్త పియర్ క్యూరీ, కూతురు ఇరీన్ క్యూరీ, అల్లుడు ఫ్రాంక్ జులియెట్లకు కూడా నోబెల్ బహుమతులు లభించాయి.

# బడి ప్రకృతికి తెరిచిన కిటికీ

## 'విజ్ఞానంతోనే వికసించు జగత్తు పసిపిల్లల చదువే దానికి విత్తు'

**పి**ల్లల్ని విద్యావంతుల్ని చేయడానికి ఉపాధ్యాయులు తమ మేధస్సుకు పదును పెడతారు. ఎంతో శ్రమపడతారు వారి అభివృద్ధి కోసం కొత్తకొత్త పద్ధతుల్ని అన్వేషించి విద్యాబోధన గావిస్తారు. సులభంగా అర్థం కావడానికి బోధనోపకరణాలను తయారుచేస్తారు. ఇన్ని చేసినా ఎక్కడో ఏదో వెలితి కనబడుతూనే ఉంటుంది. పాఠం బాగా చెప్పానని అనుకుంటాడు ఉపాధ్యాయుడు. పిల్లలూ అర్థమైనట్టు తలలూపుతారు. అంతటితో అయిపోయిందా? ఒక చిన్న బొమ్మ తయారు చెయ్యాలంటే ఆ బొమ్మ చేసే వాళ్ళమధ్య అవగాహన ఉండాలి. ఒకరు తల, ఒకరు చేతులు, ఒకరు కాళ్ళు ఇలా విడి భాగాల్ని చాలా అందంగా తయారు చెయ్యొచ్చు. అవి విడివిడిగా బాగానే ఉండొచ్చు. విడివిడిగా ఉన్న ఆ భాగాలను అమర్చినపుడు ఒకదానికొకటి పొంతన లేకపోతే కొలతలు సరిగా లేక బొమ్మ అమరిక కుదరదు. అలాగే పిల్లాడికి విద్యను అందించే ఉపాధ్యాయుల మధ్య ఒక మంచి అవగాహన లేకపోతే ఆ బోధన కూడా అమరిక కుదరని బొమ్మలాగే తయారవుతుంది.

తరగతి గదిలోకి ఉపాధ్యాయుడు అడుగుపెట్టే ముందు తన వ్యక్తిగత నమ్మకాల్ని, మత విశ్వాసాల్ని వడకట్టుకోవాలి. నిర్మలమైన, స్వచ్ఛమైన మనసుతో విద్యార్థుల ముందు నిలబడాలి. శాస్త్రీయమైన, తార్కికమైన అవగాహనతో విద్యార్థులలో ప్రశ్నించే తత్వాన్ని అలవరచాలి. తమ వ్యక్తిగత భావనలను విద్యార్థులపై రుద్దకూడదు. తరగతిగదిలో దేవుళ్ళ చిత్రపటాలు, బాబాల, స్వామీజీల ఫొటోలు వంటివి లేకుండా చూసుకోవాలి. భిన్నమతాలకు చెందిన విద్యార్థులున్న తరగతిగదిలో దైవభక్తి అనే అంశం చొరబడకుండా 'దేశభక్తి' అలవడేలా చేయాలి. ఉపాధ్యాయులకు మూర్తిమత్వం ముఖ్యం. విద్యార్థులు తమ ఉపాధ్యాయుల్ని అనుకరిస్తారు. ఉపాధ్యాయుడు సాధ్యమైనంత నిరాడంబరంగా ఉండడం అవసరం. సాధ్యమైనంత వరకు బంగారు ఆభరణాలు, ఖరీదైన అలంకరణలు లేకుండా తరగతిగదిలోకి వెళ్ళడం మంచిది. ఉపాధ్యాయుడే విద్యార్థికి ఆదర్శం, ఉపాధ్యాయుడే విద్యార్థికి హీరో, కాబట్టి ఉపాధ్యాయుల నడవడిక ఆదర్శంగా ఉండడం అవసరం.

బడి అంటే చదువులమ్మ గుడి. ఆ గుడిని పవిత్రంగా ఉంచుకోవడంలోనే ఉపాధ్యాయుడి నిబద్ధత, నిమగ్నత వ్యక్తమౌతాయి. విద్యార్థులు భావి జీవితానికి పునాది దిగువ తరగతులే. మానవీయ విలువలు అందాల్సింది, అలవడాల్సింది బడిలోనే.అవిపద్యాలరూపంలో,పాటలరూపంలోఎంతఎక్కువగా అందితే అంత మంచిది. అవే విద్యార్థితో పాటు ప్రయాణిస్తాయి. భవిష్యత్తుకు అవి చక్కని మార్గాన్ని చూపిస్తాయి. దారి తప్పినపుడు తళుక్కుమని తలలో మెరిసి హెచ్చరిస్తాయి. పాఠశాల ఆవరణ నిశ్శబ్దంగా, ఏ సందడీ లేకుండా గాలి ఆడనట్టుండకూడదు. పిల్లలు ఆడాలి, పాడాలి, బొమ్మలేయాలి, కథలు చెప్పాలి, కథలు కట్టాలి. విద్యార్థులలోని సృజనాత్మకతను గుర్తించి వారిలోని చిత్రకారుల్ని, గాయకుల్ని, నటుల్ని, రచయితల్ని ప్రపంచానికి అందించాలి. కవి అన్నట్టు

*"చదువంటే...*
*పుస్తకాలలో పురుగై తిరగడమా..?*
*చదువంటే ర్యాంకుల యడారిదారులు కొలవడమా?*
*కాదు*
*చదువంటే...*
*మెదడు పువ్వులా విచ్చుకుని మనసు వాకిలి తలుపు తెరవడం,*
*చిట్టిచేతులతో మట్టిముఖాన ఆకుపచ్చని కళలు అద్దడం".*

మట్టి, మొక్కలు, పూలు, పుస్తకాలు, పాటలు, కథలు, బొమ్మలు ఇవన్నీ విద్యలో భాగాలే. విద్యార్థులకు ప్రకృతిపట్ల ప్రేమ కలగడానికి 'బడి' ఒక అందమైన సృజనాత్మకమైన 'ప్రకృతికి తెరిచిన కిటికీ'.

పాఠమే పాటగా, చదువే ఒక ఆటగా గురువే విద్యార్థికి చక్కని నేస్తంగా మనసును మురిపిస్తే, బాధలు మరిపిస్తే తరగతి గదులే రేపటి తరగని నిధులు.




రచన: *గంటేడ గౌరునాయుడు,*
*విశ్రాంత ఉపాధ్యాయుడు, దళాయిపేట,*
*పార్వతీపురం మన్యం జిల్లా*
*ఫోన్: 9441415182*




# పిల్లల పట్ల పెద్దల ప్రవర్తన

## 'నేటి బాలలే రేపటి పౌరులు'..

రేపటి పౌరులే మన దేశం భవిష్యత్తు. భారతావని భవిష్యత్ అయిన బాలలను మనం, అంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎలా తీర్చిదిద్దాలి?

### ఈ సందర్భంగా కొన్ని విషయాలు:


* పిల్లలు ఏదైనా మనకు చెప్పాలనుకున్నపుడు మనము చాలా ఓపిగ్గా వినాలి.
* ఏ పిల్లవాడు కూడా అశక్తుడు కాడు., సామర్థ్యము లేనివాడు కాదు.
* తల్లిదండ్రి తప్పకుండా చిన్న వయసులో (దాదాపు ఒక 12 సంవత్సరాలు వచ్చేవరకూ... అనగా టీనేజ్ దాటేవరకూ) ప్రతిరోజూ వారితో కొంత సేపైనా గడపాలి.
* పిల్లలను యంత్రాలుగా చేసి, మా పిల్లల గొప్పతనం చూడమని, ఇంటికి వచ్చిన వారితోనూ, బంధువులతోనూ వారు నేర్చుకున్న విషయాలను ప్రదర్శింపజేయడం తప్పు.
* పిల్లల విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకూ చాలా సహనం కావాలి.
* తమ పిల్లలను ఏ తల్లిదండ్రీ ఇతర పిల్లలతో పోల్చరాదు. ఉపాధ్యాయుడు కూడా ఒక పిల్లవాడి సామర్థ్యాన్ని ఇతర పిల్లలతో పోల్చి తప్పు పట్టరాదు.
* పిల్లలు తెలియక తప్పు చేస్తే అది వారికి సున్నితంగా తెలియజేయాలే కానీ శిక్షించడం చేయరాదు.
* పిల్లలకు మాట్లాడడంలోనూ, పనులు చేయడంలోనూ అవసరమైన స్వేచ్ఛ ఇవ్వాలి.
* పిల్లలు పుట్టక ముందు నుంచే, అనగా తల్లి గర్భంలో ఉన్నప్పటి నుండే వారి భవిష్యత్తు గురించి కలలు కనడం మానాలి. పుట్టిన తరువాత కూడా పిల్లల ఆసక్తికి అనుగుణంగా వారి భవిష్యత్తుకు బాటలను వారే సొంతంగా వేసుకునేలా సహకరించాలి. అందుకు ఒక మార్గదర్శిగా మాత్రమే ఉండాలి.
* పిల్లల మనసును సాధ్యమైనంతవరకూ అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. కానీ, ప్రతి చిన్న విషయానికీ కోప్పడరాదు.
* పిల్లల కన్నా డబ్బు ముఖ్యం కాదనే విషయం ప్రతి తల్లి, తండ్రీ గ్రహించాలి.
* ఫీజులు ఎక్కువగా కట్టించుకునే పాఠశాలలు, గ్రౌండు పెద్దగా ఉన్నవీ, బాగా ప్రకటనలలో నానుతుండేవీ, ఎప్పుడూ హోమ్ వర్క్ ఇచ్చేవీ, ఇంటి దగ్గర క్షణం కూడా తీరిక లేకుండా చేసే పాఠశాలలన్నీ మంచివని అనుకోవడం చాలా తప్పు.
* పిల్లలకు తగినంత ఎండ, గాలి తగిలే విధంగా బయటి ఆటలు ఆడడం చాలా అవసరం అని గ్రహించాలి.
* ఎప్పుడూ నాలుగు గోడల మధ్యలో ఉంచరాదు. తోటి వారితో కూడా స్వతంత్రంగా ఆడనివ్వాలి.
* పిల్లల విజ్ఞానానికి మార్కులు కొలమానం కాదు. విజ్ఞానానికి మార్కులు, గ్రేడులతో సంబంధం ఏమాత్రం లేదనే విషయం తెలుసుకోవాలి.
* పిల్లలను ఏ పాఠశాలలో చేర్చాలనేది ముందే ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. ఆ తర్వాత తప్పనిసరైతే తప్ప, ఎట్టి పరిస్థితులలోనూ పిల్లలు చదువుకునే పాఠశాలలను పదే పదే మార్చరాదు.
* పిల్లలు చేసే తప్పులకు, పొరపాట్లకు కారణాలు తప్పకుండా ఉంటాయి. వారిని కొట్టకుండా, కోప్పడకుండా ఆ కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేయాలి. వాటిని నివారించి, పునరావృతం కాకుండా చూడాలి.

* పిల్లలు మనం ఆశించినట్లుగా ఉండాలని కోరుకోరాదు. వారి ఆలోచనలను, సామర్థ్యాలను కనుక్కుని అందుకు అనుగుణంగా సలహాలిస్తూ, బాటలు వేయాలి.
* చిన్న పిల్లల మనసులను వీలైనంతవరకూ గాయపడకుండా చూడాల్సిన బాధ్యత పెద్దలదైన మనదే.
* చిన్న పిల్లల ఇష్టాయిష్టాలను గౌరవించాలి. తీర్చడమా? లేదా? అన్నది తర్వాత విషయం. అవసరమైనవి వాటి ఉపయోగాలను వివరించాలి. అనవసరమైన వాటి వల్ల నష్టాలు పిల్లలకు నెమ్మదిగా తెలియజెప్పాలి
* పిల్లలకు, పద్యాలు, కథల వలన చాలా చాలా ఉపయోగం ఉందన్న విషయం తెలుసుకోవాలి. కథల్లో నిగూఢంగా దాగి ఉన్న కారణాలను, అంతరార్థాలను తెలుసుకుని వివరించాలి. విన్న కథల పట్ల ప్రశ్నించడం, విశ్లేషించడం నేర్పించాలి.
* అమ్మాయిల పట్ల, ఆడవారి పట్ల, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, పొరుగువారు, బంధువుల పట్ల, మరీ ముఖ్యంగా గర్భం దాల్చిన ఆడవారి పట్ల (పిల్లల వయసుకు తగిన రీతిలో) ఎలా ప్రవర్తించాలో? పెద్దలందరూ చెప్పాల్సిన విషయం.
* పిల్లలకు ఆసక్తి లేని విషయాలను బలవంతంగా వారిపై రుద్ద కూడదు.
* పిల్లలు చేసే ప్రతి పనీ చెడ్డదిగా భావించరాదు. ఆ పనిని తెలుసుకొని, చెడ్డదైతే తెలియజెప్పి మాన్పించాలి. మంచివైతే ప్రోత్సహించాలి.
* మన పిల్లల తప్పులను ప్రచారం చేయరాదు. తప్పు ఎందుకో? వివరించి అర్థం చేసుకునేలా ఓపికగా చెప్పాలి.

**– మద్దిరాల శ్రీనివాసులు,**
హెడ్మాస్టర్, ప్రాథమిక పాఠశాల,
గురవారెడ్డిపాలెం, ప్రకాశం జిల్లా



# పాఠశాల విద్యకు దశ-దిశ మెగా PTM సమావేశాలు




దేశంలోనే తొలిసారిగా రాష్ట్రమంతా ఒకేసారి వేలాది పాఠశాలల్లో జరగబోయే మెగా పేరేంట్- టీచర్ మీటింగు విద్యా వ్యవస్థకే మార్గదర్శనం చేయనుంది. విద్యార్థులే తమ తల్లిదండ్రులను ఆహ్వానించి పాఠశాలలో ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం అయ్యే అద్భుత సందర్భం ఇది. ఆటలు, పాటలు, మాటలతో విద్యకు దిక్సూచిగా నిలిచే మెగా పేరేంట్- టీచర్ మీటింగ్ విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు భారీగా సాగుతున్నాయి.

### తల్లిదండ్రులే అతిథులు

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ నిర్వహణలో ఉన్న అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ (PTM)లు త్వరలో నిర్వహించాలని సమగ్ర శిక్షా, పాఠశాల విద్యా శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించాయి.తమ పిల్లల చదువు, సమస్యలు, కావాల్సిన సౌకర్యాలు గురించి తెలుసుకోవడమే కాదు..విద్యావికాసానికి, పాఠశాల అభివృద్ధికి సలహాలు-సూచనలు కూడా ఇవ్వవచ్చు.

### ఎవరెవరు పాల్గొంటారంటే..

ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు, దాతలు, పూర్వ విద్యార్థులు, పాఠశాల యాజమాన్య కమిటీ (SMC) సభ్యులు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు.


### చర్చించే అంశాలివి

క్లాస్ టీచర్, సబ్జెక్ట్ టీచర్, విద్యార్థుల హాజరు, పురోగతి, ప్రవర్తన,శారీరక-మానసిక ఆరోగ్యం, క్రమశిక్షణ, భద్రత, ఆసక్తులు, తరగతి గదిలో సవాళ్లు, హోమ్‌వర్క్, ప్రాజెక్ట్‌లు, మధ్యాహ్న భోజనం, ఆడపిల్లల విద్య ప్రాముఖ్యత, ఫిర్యాదు పెట్టెపై అవగాహన, తల్లిదండ్రుల మద్దతుపై చర్చిస్తారు.

### నిర్వహించే పోటీలు

తల్లులకు రంగోలీ, తండ్రులకు టగ్ ఆఫ్ వార్, తల్లిదండ్రులతో సాంస్కృతిక కార్యక్రమాలు, పాఠశాల పురోగతిపై నివేదిక, మొత్తం పాఠశాల విద్యా పనితీరు, నమోదు, డ్రాపౌట్‌లు, విజయాలు, ఉన్న సౌకర్యాలు, పాఠశాల అవసరాలు - సహకారాలు, సైబర్ అవగాహన, తల్లిదండ్రులు, అతిథులు, ఆహ్వానితుల నుండి అభిప్రాయ సేకరణ, ప్రసంగాలు, అంతా కలిసి భోజనం చేయడం వంటి కార్యక్రమాలతో ఓ పండగలా 'మెగా పీటీఎం' ని నిర్వహించనున్నారు.








www.tlm4all.com

# పాఠశాల అభివృద్ధికి పాఠశాల యాజమాన్య కమిటీ (SMC) పాత్ర కీలకం

★ సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు శ్రీ బి.శ్రీనివాసరావు గారు
★ రెండు కేంద్రాల్లో దాదాపు 320 మంది రిసోర్సు పర్సన్లు హాజరు

పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రగతికి పాఠశాల యాజమాన్య కమిటీ కీలక పాత్ర వహించాలని, తద్వారా సత్ఫలితాల సాధన వైపు పయనించవచ్చని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు గారు అన్నారు. పెదపరిమిలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తొలిసారి పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు శిక్షణలో ప్రాతినిధ్యం కల్పించామన్నారు. ఎస్ఎంసీల కోసం రూపొందిస్తున్న ప్రత్యేకమైన మొబైల్ యాప్ ద్వారా సభ్యులే అధికారుల దృష్టికి తమ పాఠశాల ప్రగతి, సమస్యను తీసుకువెళ్లవచ్చని పేర్కొన్నారు. అనంతరం సమగ్ర శిక్షా, పాఠశాల విద్యాశాఖ రూపొందించిన 'పాఠశాల యాజమాన్య కమిటీ' కరదీపిక ఆవిష్కరించారు. ఏలూరు జిల్లా ఆగిరపల్లి 'హీల్ ప్యారడైజ్'లో జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ వర్క్ షాపునకు అతిథిగా సీమ్యాట్ డైరెక్టర్ శ్రీ వి.ఎన్.మస్తానయ్య హాజరు కాగా, సీమ్యాట్, శామో, సమగ్ర శిక్షా, కమ్యూనిటీ మొబలైజేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



'పాఠశాల యాజమాన్య కమిటీ' కరదీపిక ఆవిష్కరణ



ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు క్రిస్టెల్ కౌమే, ప్రియాంక సాహూ ఎఫ్ఎల్ఎన్ శిక్షణ జరుగుతున్న YES–J సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ (విజయవాడ), పెదపరిమి (గుంటూరు జిల్లా) కేంద్రాలను అక్టోబర్ 24న సందర్శించారు. FLN కిట్ (జాదూయి పిటారా), టీఎల్ఎంలను పరిశీలించి శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులతో మాట్లాడారు.

## ఇన్ హౌస్

# విద్యా నాణ్యత పెంచడమే ఎఫ్ఎల్ఎన్ శిక్షణ లక్ష్యం

* సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు
* రాష్ట్రంలో 9 చోట్ల ఆరు రోజుల పాటు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ
* దేశంలోనే తొలిసారిగా గ్రేడ్ 1, గ్రేడ్ 2 ఉపాధ్యాయులకు శిక్షణ



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యత పెంచడమే ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) శిక్షణ లక్ష్యమని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు శ్రీ బి.శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న గ్రేడ్ 1, 2 ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం మన దేశంలోనే తొలిసారి అని తెలిపారు. జాతీయ విద్యా విధానానికి, నిపుణ్ భారత్ అనుగుణంగా రూపొందించిన 14 విడతలలో జరిగే శిక్షణలో గ్రేడ్ 1, గ్రేడ్ 2 ఉపాధ్యాయులు 34,000 మంది పాల్గొంటారని పేర్కొన్నారు. విజయవాడ లయోలా కాలేజీ యెస్–జే సెంటర్‌లో శిక్షణ ఆరంభించిన ఎస్పీడీ ఎఫ్ఎల్ఎన్ మాడ్యూళ్లను ఆవిష్కరించారు. శ్రీకాకుళం, విజయనగరం, రాజమండ్రి, విజయవాడ, పెదపరిమి, తిరుపతి, వైయస్సార్ కడప, హిందూపురం, బుక్కరాయసముద్రం ప్రాంతాల్లో జరిగిన మొదటి విడత శిక్షణకు 1900 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు.

**లెటర్స్ టు ది ఎస్పీడీ:**
విద్యార్థులు, ఉపాధ్యాయులారా!
విద్యా సంబంధిత అంశాలు, పాఠశాలల అభివృద్ధి గురించి ఏవైనా ఆలోచనలు, సమస్యలు నాతో పంచుకోండి..
- మీ ఎస్పీడీ



www.tlm4all.com

# 'విద్యార్థి మిత్ర' ప్రభుత్వం



విజయవాడ వరద బాధితుల కోసం సీఎం సహాయనిధికి చెక్కు అందిస్తున్న దృశ్యం

## వరద ముంపు ప్రభావిత పాఠశాలల విద్యార్థులకు 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర' కిట్ల పంపిణీ

ఆలోచన

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర' కిట్‌లో భాగంగా బ్యాగు, 3 జతల యూనిఫాం క్లాత్, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, డిక్షనరీ అందజేశారు. ఇటీవల ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో వరద బీభత్సం సృష్టించింది. దీంతో కొన్ని ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. అక్కడి విద్యార్థుల పుస్తకాలు, బ్యాగులు సైతం తడిచిపోయాయి. ఆ విషయాన్ని గ్రహించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు కిట్లు కోల్పోయిన విద్యార్థులకు చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా కొత్త కిట్లు ఇవ్వాలని విద్యాశాఖ, సమగ్రశిక్షా ఉన్నతాధికారులను ఆదేశించారు. వరద ముంపు ప్రభావిత ప్రాంత పాఠశాలల విద్యార్థులు అందరికీ 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర' కిట్లు అందజేశారు.

అభినందన

### సీఎం సహాయనిధికి కోనసీమ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రూ. 50 వేలు విరాళం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామంలోని పోలిశెట్టి లక్ష్మి పార్వతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది కలిసి రూ. 50 వేల చెక్కుని కోనసీమ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి పంపించారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో జి. సూర్య ప్రకాశం, కాట్రేనికోన మండల విద్యాశాఖాధికారులు, పాఠశాల హెచ్ఎం ఎ.శేషసాయి, పాఠశాల సిబ్బంది, ఎస్ఎంసీ చైర్మన్ పోలిశెట్టి వెంకటరాజు, వైస్ చైర్మన్ ఎం.ఎస్.వర్మ, చెయ్యేరు గ్రామ సర్పంచ్ చెల్లి సురేష్, వైస్ సర్పంచ్ బి.వి.నారాయణస్వామి, ఎంపీటీసీ సభ్యురాలు గుత్తుల మహాలక్ష్మి, వార్డ్ మెంబర్ కాయల బలరాం పాల్గొన్నారు.









www.tlm4all.com







# సమగ్రశిక్షా ఉద్యోగుల చిరుసాయం

ఇటీవల కురిసిన అతిభారీ వర్షాల వల్ల బుడమేరు వాగు ఉప్పొంగడంతో విజయవాడ వరద ప్రాంతంగా మారింది. ఎన్నో కుటుంబాలు ఆకలి ఆర్తనాదాలతో పొట్ట చేత పట్టుకుని ఉన్నాయి. సమగ్రశిక్షాలో పని చేస్తున్న కొందరు చిరుద్యోగులకు కూడా ఆ వరద దెబ్బ తాకింది. సమగ్ర శిక్షా ఉద్యోగులంతా కలిసి స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చారు. ఆ సొమ్ముతో బాధిత కుటుంబాలకు ఫ్రిజ్, వాషింగ్ మెషిన్, నగదు రూపేణా సమగ్ర శిక్షా ఎస్పీడీ శ్రీ బి.శ్రీనివాసరావు IAS., ఏఎస్పీడీ అందజేశారు. ఆదుకున్నందుకు అధికారులకు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదరణ

## వరదబాధితులకు 'అండ'గా నిలిచిన సమగ్రశిక్షా

*ఒక వైపు కృష్ణమ్మ కన్నెర్ర చేయగా*
*మరోవైపు బుడమేరు బుసలు కొట్టింది..*
*ఈ రెండు ప్రవాహాలు*
*విజయవాడపై విలయతాండవం చేశాయి.*
*ప్రజలను ఏడిపించాయి.*
*ఆకలిదప్పులతో ఎంతోమంది అల్లాడుతుంటే అందరినీ ఆదుకోవడానికి ప్రభుత్వం సకల ప్రయత్నాలు చేసింది.*
*మరెంతోమంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఆహారం అందించారు. తోచిన సాయం చేశారు.*
*అందులో భాగమే...*

గౌరవ విద్యాశాఖామాత్యులు నారా లోకేష్ గారి ఆదేశాల మేరకు సమగ్ర శిక్షా ఎస్పీడీ శ్రీ బి.శ్రీనివాసరావు IAS., గారి నేతృత్వంలో ఆహార పొట్లాలతో పాటు, ఉడికించిన గుడ్లు బాధితులకు అందించాలని బాధ్యత తీసుకున్నారు. సమగ్రశిక్షా అధికారులు, సిబ్బంది సాయంతో రాత్రికి రాత్రి యుద్ధ ప్రాతిపదికన దాదాపు 4లక్షల గుడ్లు ఉడకబెట్టించి ఉదయానికే అందజేశారు.









www.tlm4all.com

# రచనలకు ఆహ్వానం



**ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, రచయితలకు, తల్లిదండ్రులకు విజ్ఞప్తి...**

"పాఠశాల విద్యాశాఖ – సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో విద్యా, విషయక, విజ్ఞాన అంశాలతో వస్తున్న మాసపత్రిక **మన బడి** కోసం.. మీ నుంచి రచనలను ఆహ్వానిస్తున్నాం. పిల్లలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని అందించే రచనలు ఏవైనా, ఎవరైనా పంపవచ్చు. కథలు, వ్యాసాలు, కవితలు, గేయాలు, జోకులు, బొమ్మలు, కార్టూన్లు, అనువాద రచనలు, సృజనాత్మక బోధనా పద్ధతులు, విద్యార్థులు రూపొందించిన ఉత్తమ ప్రాజెక్టులు... ఇలా ఏ అంశాన్నయినా రాసి పంపండి. బాగున్నవాటిని ప్రచురిస్తాం. సొంత రచనలై ఉండాలి, ఎక్కడ ప్రచురితం కాకూడదు. మీ పేరు, ఫోన్ నంబరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జోడించండి. ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. ఎంపిక కాని రచనలు తిరిగి పంపబడవు. ప్రచురితమైన వాటిలో ఉత్తమ రచనలకు చక్కని బహుమతి ఇవ్వబడును. ఈ రచనా యజ్ఞంలో పిల్లలు, తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు ,రచయితలు భాగస్వాములవ్వాలని కోరుతున్నాం. ఇందులో రచయితల వెలిబుచ్చిన అభిప్రాయాలు పూర్తిగా వారి సొంతం. రచయితల అభిప్రాయాలతో సంపాదకులు, ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఏకీభవించాల్సిన పనిలేదు."

మీ రచనలు పంపాల్సిన చిరునామా:


## స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ & ఎడిటర్

సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయం, కేబీసీ బాయ్స్ హైస్కూల్ కాంపౌండ్,
పటమట, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్: 520 010,
వాట్సాప్ నంబర్: 87126 52298 manabadimagazine@gmail.com







Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed by : **M/s. Lakshmi Vignesh Printers,** Guntur


www.tlm4all.com